## 10

# పరిశుద్ధాత్మ & క్రైస్తవులు

*“శరీరానుసారులు శరీరవిషయములమీద మనస్సునుంతురు, ఆత్మానుసారులు ఆత్మవిషయములమీద మనస్సు నుంతురు; శరీరానుసారమైన మనస్సు మరణము; ఆత్మానుసారమైన మనస్సు జీవమును సమాధానమునైయున్నది. ఏలయనగా శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమైయున్నది; అది దేవుని ధర్మశాస్త్రమునకు లోబడదు, ఏమాత్రమును లోబడనేరదు” (రోమా 8:5-7).*

పరిశుద్ధాత్మ అంతర్ నివాసమును గూర్చి మనం చదివాం. తరువాత, క్రైస్తవులకు సంబంధించి పరిశుద్ధాత్మ యొక్క యితర కార్య కలాపాలను గూర్చి ఆలోచించుదాం. నేటి క్రైస్తవుల జీవితాల్లో పరిశుద్ధాత్మ పనిచేస్తున్నాడా? అయితే, ఆయన ఏమి చేస్తున్నాడు?

### ఆత్మసంబంధమైన జలాశయమును ఏర్పాటు చేయును

మొదటిగా, అంతరంగములో ఆత్మ సంబంధంగా నూతనపరచబడడానికి పరిశుద్ధాత్మ మూలమైయున్నాడు. యోహాను 7:38, 39 యిలా అంటుంది: “నాయందు విశ్వాస ముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులోనుండి జీవజల నదులు పారునని బిగ్గరగా చెప్పెను.” లోపలనుండి ఉబకని, వెలుపటి మూలంనుండి నింపబడే తొట్టికి భిన్నంగా, అంతర్గత మూలమును బట్టి నీటి ఊట ప్రవహించుచుతూ ఉంటుంది. ఆత్మ ఈ కార్యాన్ని ఎలా చేస్తాడో ప్రభువు తెలుపలేదు. ఆత్మ అలా చేస్తాడని మాత్రమే తెలిపారు. అది ఎలా జరుగుతుందో మనం ఊహించ పనిలేదు. కాని ఆత్మసంబంధమైన అంతరంగపు జలాశయము బట్టి ఆత్మ క్రైస్తవులకు సహాయం చేస్తాడనే వాస్తవాన్ని అంగీకరించవలసి యుంటుంది. దేవుని వాక్యాన్ని అలక్ష్యం చేసేవారు లేక ఆయన చిత్తానికి వ్యతిరేకంగా జీవించేవారు - తమ జీవితాల్లో ఆత్మ సంబంధమైన “జీవజలముల” ప్రవాహాన్ని కలిగియుండాలని నిరీక్షింప వీలుపడదు.

### పాపమరణముల నియమమునుండి మనలను విడిపించును

రోమ 8:2, 3ల్లో మనం యిలా చదువుతాం: “క్రీస్తుయేసునందు జీవమునిచ్చు **ఆత్మ** యొక్క నియమము పాపమరణముల నియమమునుండి నన్ను విడిపించెను, ఎట్లనగా ధర్మశాస్త్రము దేనిని చేయజాలక పోయెనో దానిని దేవుడు చేసెను. శరీరము ననుసరింపక ఆత్మ ననుసరించియే నడుచుకొను మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతివిధి

నెరవేర్చబడవలెనని పాప పరిహారమునిమిత్తము దేవుడు తన సొంత కుమారుని పాపశరీరాకారముతో పంపి, ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను" హృదయముల మీదగాక రాతిపలకలమీద వ్రాయబడిన మోషే ధర్మశాస్త్రము ఆజ్ఞలతో కూడినదై మరణాన్ని తెచ్చింది (2 కొరింథీ. 3:6). బహు తరచుగా, దేవుని శాసనాలు రాతి పలకలమీదనే నిలిచి పోయాయి గాని ఆచరింపబడునట్లు అవి మానవ హృదయాల లోనికి తర్జుమా చేయబడినవి కావు (రోమా 2:27-29). క్రైస్తవులమైన మనము "అక్షరాను సారమైన ప్రాచీనస్థితిగలవారము కాక ఆత్మానుసారమైన నవీనస్థితిగలవారమై సేవచేయుచున్నాము" (రోమా 7:6బి). ఆత్మతో మనము సహకరించినవారమైతిమా, మన హృదయముల సున్నతికి ఆయన సహాయపడును. పాపేచ్ఛలనుండి తొలగించబడిన వారమై పాపమరణముల నియమమునుండి మనము విడుదల పొందగలము (రోమా 8:2).

ఆత్మతో మనం ఎలా సహకరించాలో నేర్చుకొనడానికి దేవుని వాక్యము (2 తిమోతి 3:16, 17) ఆధారమైయుంటుంది. లోకమును జయించు మన ప్రయాసలోను వాక్యమునకు అనుకూలంగా మార్చబడుటలోను ఆయన మనకు బలమును ప్రసాదిస్తాడు (ఎఫెసీ. 3:16; 1 యోహాను 4:4) - అయితే యిష్టపూర్వకంగా మనము ఆ దిశగా మన ప్రయాసలను పెట్టినప్పుడే (2 కొరింథీ. 7:1).

## మనలను నడిపించును

మూడవది, ఆత్మ క్రైస్తవులను నడిపించును."దేవుని **ఆత్మ**చేత ఎందరు నడిపింప బడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు" (రోమా 8:14). "ఆత్మచే మనము నడిపింపబడగలము" అనేది మన ప్రశ్న కాదు, కాని "మనము ఆత్మచే ఎలా నడిపింపబడతాము?" అనేది మన ప్రశ్న. క్రైస్తవులుగా మన నూతన జన్మ వాక్యము ద్వారా వస్తుంది (1 పేతురు 1:23). ఆయన ఆజ్ఞలు మనం బోధింపబడనట్టయితే, క్రీస్తు ప్రభువుకు ఎలా లోబడాలో మనకు తెలియదు (మత్తయి 28:20).

ప్రభువు వాక్యాన్ని ఆత్మ అపొస్తలులకును ప్రవక్తలకును అప్పగించాడు (యోహాను 14:26; ఎఫెసీ. 3:3-5). ఆ వాక్యాన్ని వెంబడించినవారు ఆత్మచే నడిపింపబడినవారై యుంటారు. మానవ ఉపదేశాన్ని వెంబడించేవారు మనుష్యులచే నడిపింపబడినవారై యుంటారు. మనము ఆత్మచేత జీవించువారమైయుంటిమా, "ఆత్మానుసారముగా నడుచు కొనవలసినవారమైయున్నాం" (గలతీ. 5:16, 25). అంటే, ఆత్మచేత బయలుపరచబడిన (యోహాను 16:13), సత్యములో మనం నడవాలి (2 యోహాను 4; 3 యోహాను 3, 4). ఆత్మచేత నడిపింపబడువారమైతిమా, మనము ధర్మశాస్త్రము క్రింద గాక (గలతీ. 5:18), కృప క్రింద ఉన్నవారమై యున్నాం (రోమా 6:14). కృపలో నిలిచియుండ గోరితిమా, ఆత్మచే బయలుపరచబడిన ఫలమును ఫలించువారమై యుండాలి (గలతీ. 5:22, 23) గాని శరీరేచ్ఛలను వెంబడించకూడదు (గలతీ. 5:19, 21). ఈ లక్షణాలను మనకొరకు ఆత్మ మన జీవితాలలో ఉంచదు. శరీరేచ్ఛలను బట్టి కాక ఆత్మను బట్టియే

మనము విత్తువారమైయుండాలి (గలతీ. 6:8).

## దేవుని పిల్లలమని ఆత్మ సాక్ష్యమిచ్చును

తరువాత "మనము దేవుని పిల్లలమని **ఆత్మ** తానే మన **ఆత్మతో** కూడ సాక్ష్యమిచ్చును" అని చదువుతాం (రోమా 8:16). ఆత్మ సాక్ష్యమేమి, మన పరిశుద్ధాత్మ సాక్ష్యమేమి?

**ఆత్మ** మన ఆత్మలతో మాట్లాడినట్టు ఆత్మ మన ఆత్మలకు సాక్ష్యమిచ్చునని పౌలు చెప్పుట లేదు. కాని, మనము దేవుని పిల్లలమని సాక్షమిచ్చుటలో ఆత్మతో మన ఆత్మలు ఏకీభవిస్తాయి.

మన సాక్ష్యము మనయందుండే నమ్మికయే (1 యోహాను 5:10), కాని పరిశుద్ధాత్మ యొక్క సాక్ష్యమేమి? తాను బయలుపరచిన వర్తమానంలో ఆత్మయొక్క సాక్ష్యం కన్పిస్తుందా (హెబ్రీ. 10:15). ఆయనను గూర్చి మాట్లాడడంలో యోహాను ప్రభువైన యేసును గూర్చి సాక్ష్యమిచ్చాడు (యోహాను 1:15). అలాగే, సత్యవాక్యమును బయలుపరచుట ద్వారా ఆత్మ క్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చాడు (యోహాను 15:26, 27; 1 యోహాను 5:7). క్రీస్తు ప్రభువు మాటలు జీవానికి మూలమైయున్నాయి (యోహాను 6:63; 12:49, 50). ఆత్మవలన బయలుపరచబడిన క్రీస్తువారి ఉపదేశము ద్వారా మనము దేవుని పిల్లలమైనప్పుడు, మనము నూతన జీవమునకు వచ్చియున్నట్టు మన ఆత్మలు స్థిరపరచగలవు. అప్పుడు మన ఆత్మలు పరిశుద్ధాత్మతో ఏకీభవిస్తాయి.

దేవుని సత్యవాక్యమువలన మరల జన్మింపజేయబడినవారు (1 పేతురు 1:22, 23) – అంటే, ప్రభువైన యేసునందలి విశ్వాసము ద్వారా బాప్తిస్మము పొందినవారు – దేవుని పిల్లలైయున్నారనియు (గలతీ. 3:26, 27), నూతన జీవములోనికి ప్రవేశించిన వారనియు (రోమా 6:4) ఆత్మ సాక్ష్యమిస్తాడు. మనము ఈ సంగతులను జరిగించి, మనము ఆయన మూలముగా పుట్టిన దాన్నిబట్టి నూతన జీవము (జీవితము) కలిగినవారమైతిమా (1 యోహాను 2:29), మనము దేవుని పిల్లలమని సాక్ష్యమిచ్చునప్పుడు, మన సాక్ష్యము ఆత్మ సాక్ష్యముతో ఏకీభవిస్తుంది. ఆ విధంగా మనము దేవుని పిల్లలమనే నిశ్చయత కలిగియుండగలం (1 యోహాను 5:10). లేఖనములకు విధేయత చూపకయే, మరో విధానంలో దేవుని బిడ్డయై ఉన్నట్టు ఒకడు సాక్ష్యమిచ్చిన పక్షమందు, ఆత్మ యిచ్చిన సాక్ష్యమునే తన ఆత్మ యిచ్చుటలేదు. మరోవిధంగా చెప్పాలంటె, అతడు తన రక్షణ విషయములో అబద్ధ సాక్ష్యాన్ని యిస్తున్నాడు. ఆత్మ యిచ్చిన సాక్ష్యమునే మన ఆత్మలు యిచ్చినప్పుడు మన సాక్ష్యము సత్యమైయుంటుంది. ఆ రెండు సాక్ష్యములు ఏకీభవించినప్పుడే మనము దేవుని కుమారులమైయుంటాం.

## మన ప్రార్థనలలో సహాయము చేయును

**ఆత్మ** మన ప్రార్థనలలో సయితం సహాయం చేస్తాడు. రోమా 8:26, 27 యిలా అంటుంది:

> అటువలె **ఆత్మయు** మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింప శక్యముకాని మూలుగులతో ఆ **ఆత్మ** తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు. మరియు హృదయములను పరిశోధించువాడు **ఆత్మ**యొక్క మనస్సు ఏదో యెరుగును; ఏలయనగా ఆయన దేవుని చిత్తప్రకారము పరిశుద్ధులకొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు.

"ఒక్క **ఆత్మ**యందు తండ్రి సన్నిధికి చేరగలిగియున్నాము" (ఎఫెసీ. 2:18), క్రీస్తు ప్రభువు పనితో ఆత్మ యొక్క పని సంబంధం కలిగియుంది. ఈ మార్గంలోనే మనము "**ఆత్మ**యందు" ప్రార్థిస్తున్నామని చెప్పవచ్చు (ఎఫెసీ. 6:18; యూదా 20 చూడు).

ప్రార్థనయందు **ఆత్మ** మనలను మూలుగులిడునట్లు చేయదు. దేవునికి మనం విన్నవించుకునే ప్రయాసలో మన బలహీనతయందు ఆయన సహాయం చేస్తాడు. మాటలలో పెట్టలేని గాఢమైన మన అవసరతలను ఆయన తర్జుమా చేసి, తండ్రికి వాటిని విన్నవించుకుంటాడు. Barklay M. Newman and Eugene A. Nida యిలా రాశాడు: "**ఆత్మ** తండ్రితో తత్క్షణ సంబంధములో నిలిచియున్నందున తన ఆలోచనలను వ్యక్తపరచడానికి ఏ మాటలూ అవసరముండదు."[1]

బలహీనమైన మన ప్రార్థనలలోని ఉద్దేశాలను తీసికొని తండ్రికి బయలుపరచడంలో, ఒక భావంలో, ఆయన మనకొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు. మనం చెప్పుకునే వాటిని ఆయన తండ్రికి తెలుపుతున్నాడు. ఏదియెలాగున్నా, మనకు నిజంగా మధ్యవర్తిత్వం చేసేది క్రీస్తు ప్రభువే (1 తిమోతి. 2:5) ఆయన మనకు విజ్ఞాపనకర్తయైయున్నారు (రోమా 8:34). ఆయన మన సందేశాన్ని అందించడం మాత్రమే గాక, ఆయన మనకొరకు ఉత్తరవాదిగా ఉంటాడు (హెబ్రీ. 7:25).

ఈ లేఖన భాగము భాషలను మాట్లాడుటను గూర్చి సూచించుట లేదు "[Franz J.] Leenhardt అంటున్నట్టు, ఈ లేఖన భాగము క్రైస్తవులందరిని చేర్చడానికి ఉద్దేశింపబడింది, భాషలతో మాట్లాడడమనేది ప్రత్యేకమైన వరమైయుంది, అది అందరికి ఉన్నది కాదు."[2]

## క్రీస్తునందు మనలను ముద్రించును

విమోచన దినమువరకు క్రీస్తునందు **ఆత్మ** మనలను ముద్రించునని ఎఫెసీ. 1:13 అంటుంది (ఎఫెసీ. 4:30) మరియు మన హృదయములలోనికి "సంచకరువుగా" పంపబడినట్టు చెప్పబడింది (2 కొరింథీ. 1:22; 5:5).

మనం క్రీస్తుకు లోబడినందున (అపొ. 5:32) మనం బాప్తిస్మము పొందినప్పుడు, మనం పరిశుద్ధాత్మను పొందుతాం (అపొ. 2:38). ఈ లేఖన భాగాల్లోనే గాని, మరి బైబిల్లో యింక ఎక్కడే గాని ఆత్మ మనలో ఉన్నట్టు "ఫీలింగ్" ఉంటుందని చెప్పబడలేదు. యోహాను యొక్క ప్రతిపాదన మాదిరిగా ఉంది: "ఆయన ఆజ్ఞలను గైకొనువాడు ఆయనయందు నిలిచియుండును, ఆయన వానియందు నిలిచియుండును; ఆయన

మనయందు నిలిచియున్నాడని ఆయన మనకనుగ్రహించిన **ఆత్మ** మూలముగా తెలిసికొనుచున్నాము" (1 యోహాను 3:24). ఆయన మనయందు ఎలా నిలిచియున్నాడో ఈ వచనం మనకు తెలుపలేదు. లేఖనమునందు వ్రాసియున్న దానిని బట్టియా లేక మరియొక విధంగానా? ఈ హేతువుచేత, తన ఉనికిని **ఆత్మ** ఎలా మనము ఎరుగునట్లు చేస్తుందో నిరూపించడానికి ఈ వచనాన్ని ఉపయోగించకూడదు.

దేవుని కుమారులగునట్లుగా మనము క్రీస్తు యొక్క యిష్టానికి లోబడినవారమైతిమా (గలతీ. 3:26, 27), ఆత్మ మనకు అనుగ్రహింపబడుతుందనే నిశ్చయత కలవారమై యుందుము (గలతీ. 4:6). ఆత్మ మనయందు నివసించుటను గూర్చిన బైబిలు సత్యాలను విశ్వాసముద్వారా మనం అంగీకరించగలం (ఎఫెసీ. 3:17). మనం చూడకపోయినా మనుష్యాత్మ మనకున్నట్టు ఫీలింగ్ లేకపోయినా, ప్రతి ఒక్కరిలో మనుష్యాత్మ ఉన్న సత్యాన్ని (జెకర్యా 12:1), దేవుని వాక్యము మీద ఆధారపడి అంగీకరిస్తాం. అలాగే, మనలో పరిశుద్ధాత్మ నివాసం చేస్తాడనే సత్యాన్ని మనం అంగీకరించాలి.

అనుభవపూర్వకమైన జ్ఞానము మీద గాని లేక ఫీలింగ్‌తో మనం తెలిసికొనుట మీదగాని అంతర్ నివాసపు ఉనికి ఉన్నట్టయితే, **ఆత్మ** తమలో నివసిస్తున్న సంగతిని పౌలు కొరింథీయులకు తెలుపవలసిన అవసరం ఉండేది కాదు (1 కొరింథీ. 6:19). దానికి బదులు, ఫలాని – విదితమైన స్పర్శ లేక ప్రత్యక్షతనుబట్టి **ఆత్మ** నివసిస్తున్నట్టు అతడు వారికి తెలిపియుండేవాడే.

**ఆత్మ** మనయందు నివసిస్తున్నట్టు క్రైస్తవులముగా దేవుని వాక్యమునుండి మనము నమ్మిక లేక నిశ్చయత పొందుచున్నాము. ఆయనచే మనము ముద్రింపబడియున్నామనియు, విమోచనా దినమువరకు సంచకరువుగా ఆయనను పొందియున్నామని దైవ లేఖనాలు మనకు తెలుపుతున్నాయి.

## మన జీవితాల్లో ఫలాలను ఫలిస్తుంది

ఆత్మయొక్క ఉపదేశాన్ని అనుసరించడంవలన, "ఆత్మ ఫలములు" అనబడే స్వభావ – లక్షణాలను క్రైస్తవులు పెంపొందించుకునేలా నడిపించబడతారు: "ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము" అనేవి (గలతీ. 5:22, 23; రోమా 8:23 కూడ చూడు). మన శరీరేచ్ఛలను చంపివేయడం మాత్రమే గాక (గలతీ. 5:24; ఎఫెసీ. 4:22; కొలస్సీ. 3:8), **ఆత్మ** ఫలములని పేర్కొనబడిన గుణలక్షణములను మనము పెంపొందించు కొనవలెను (ఎఫెసీ. 4:23, 24; కొలస్సీ. 3:10-14). **ఆత్మ** ఫలములుగా పేర్కొనబడిన ఆ లక్షణములను మనము పెంపొందించు కొనవలసిన బాధ్యత మనపైయున్నది:

| | |
|---|---|
| ప్రేమ | యోహాను 13:34; కొలస్సీ. 3:14 |
| సంతోషము | ఫిలిప్పీ. 4:4; 1 థెస్స. 5:16 |
| సమాధానము | ఫిలిప్పీ. 4:6, 7; హెబ్రీ. 12:14 |
| దీర్ఘశాంతము | 2 కొరింథీ. 6:6; ఎఫెసీ. 4:2 |

| | |
|---|---|
| దయాళుత్వము | కొలస్సీ. 3:12; 2 పేతురు 1:7 |
| మంచితనము | ఎఫెసీ. 5:9; 2 థెస్స. 1:11 |
| విశ్వాసము (విశ్వాస్యత) | ప్రకటన 2:10సి |
| సాత్వికము | 1 తిమోతీ. 6:11; తీతు.3:2 |
| ఆశానిగ్రహము | 2 పేతురు 1:6 |

ఆత్మ ఫలము అద్భుతరీతిగా మనకనుగ్రహింపబడునని పౌలు చెప్పలేదు. కాని, ఆత్మసంబంధమైన గుణగణాలను మనము "ధరించుకొనవలసిందిగా" అతడు తెలిపాడు (కొలస్సీ. 3:12).

## మన ఐక్యతకు ఆధారం కలిగిస్తాడు

క్రీస్తు అనుచరులముగా, "సమాధానమను బంధముచేత **ఆత్మ** కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు" శ్రద్ధ కలిగియుండాలి (ఎఫెసీ. 4:1). **ఆత్మ**యు ఒక్కడే అయ్యుండి (ఎఫెసీ. 4:4), సత్యాన్ని బయలుపరచాడు (యోహాను 16:13). ఐక్యత కలిగించు ఉపదేశముగా, అది విశ్వాసాన్ని జనింపజేస్తుంది (ఎఫెసీ. 4:5). "పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ (విశ్వాసము) నిమిత్తము" పోరాడువారమైతిమా (యూదా 3), మనకు సాధ్యపరచబడిన ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుటలో శ్రద్ధ కలిగి యుంటాం. ఆ ఐక్యత సరియైన స్వభావము మీదను (ఎఫెసీ. 4:1–3) సరియైన క్రమము మీదను ఆధారపడియుంటుంది (ఎఫెసీ 4:4–6).

క్రీస్తువలె ఉండుటకు ఎదుగుట మీద మన ఐక్యత ఆధారపడియుంటుంది (ఎఫెసీ. 4:13). క్రీస్తువలె ఉండుటకు వచ్చేమేరకు మనం ఆత్మ కలిగించు ఐక్యత కలవారమై యుంటాం. ప్రభువు నొద్దకు వచ్చినవారమై (యోహాను 12:32) కాపరివలె ఆయనను వెంబడించుతూ (యోహాను 10:11, 14), మనం ఒకటైయుండవచ్చు. ప్రభువు నొద్దనుండి తప్పించాలనే కాపరులను మనం వెంబడించినప్పుడు (అపొ. 20:29, 30), మనము చెదరినవారమై విడిపోతాం. క్రీస్తు ప్రభువు కోరిన ఏకత్వం మనం కలిగి యుండడానికి ఆత్మ యొక్క పని ఆధారమైయుంటుంది (యోహాను 17:20–23).

## ఆత్మసంబంధమైన యుద్ధానికి మనలను సన్నద్ధులనుగా చేస్తాడు

"మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి" అని ఎఫెసీ. 6:11 అంటుంది. మన సర్వాంగా కవచములో భాగంగా, దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గముంది (ఎఫెసీ. 6:17). ఈ ఆత్మ ఖడ్గాన్ని కాపాడుకొనడానికి, యుద్ధం చేయడానికి కూడ ఉపయోగించుకోవచ్చు. వాక్యం కాపాడుకునే ఆయుధంగా ఎలా ఉపయోగింపబడుతుందో దావీదు సూచించాడు: "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను" (కీర్త 119:11). సువార్తను విస్తరింపజేయడంలో వాక్యము యొక్క ఎదిరించు శక్తి కన్పిస్తుంది (అపొ. 8:4).

మన విరోధియైన అపవాదిని ఓడించడానికి వాక్యమను ఖడ్గాన్ని వినియోగించాలి. ఆయుధములను ప్రసాదించుటవలన పాపముతో పోరాడడంలో బహిర్గతంగా ఆత్మ ఈ విధంగా సహాయపడతాడు. మన సర్వాంగ కవచాన్ని ఉపయోగించుకొనుచుండగా అంతరంగపు శక్తిని యివ్వడంవలన అంతర్గతంగా ఆయన సహాయపడుతాడు (ఎఫెసీ. 3:16; 1 యోహాను 4:4).

## మన ఆరాధనలోను, పరిచర్యలోను నడిపిస్తాడు

మనము "ఆత్మతో ఆరాధించాలి" (ఫిలిప్పీ. 3:3), ఈ లేఖన భాగంలోని "ఆరాధన" అనే పదం *latreuo* "సేవించు" (పరిచర్య చేయు) అని పదహారుసార్లు, "పూజించు" అని మూడు సార్లు యితర స్థలాల్లో తర్జుమా చేయబడింది. మన పరిచర్య (సేవ) ఆత్మ నియమించిన కొలతలలో ఉండిపోవాలి. ప్రభువునందు మన ప్రయాస ఎలా వ్యర్థము కాదో (1 కొరింథీ. 15:58), అలాగే ఆత్మయందు మనం చేసే సేవ దేవుని దృష్టికి విలువైనదిగా ఉంటుంది.

వేరొక పదం, *proskuneo* ("ఆరాధన" అని తర్జుమాచేయబడింది) దేవుని యొద్దకు చేరుటను సూచించడానికి ఉపయోగింపబడింది (యోహాను 4:23, 24). క్రీస్తుతో ప్రారంభింపబడిన, ఆత్మచే బయలుపరచబడిన సత్యానికి అనుగుణ్యంగా ఆరాధన మానవ ఆత్మలో నుండి ఉబకాలి (యోహాను 1:14, 17; 14:6; యోహాను 16:13). ఆత్మయందు కన్పించే పరిశుద్ధత యొక్క పరిధిలో మన పరిచర్య (సేవ) ఉండాలి.

## మనలను పరిశుద్ధపరచును

క్రైస్తవులముగా మనము ఆత్మచే పరిశుద్ధపరచబడినవారమై యున్నాము:

> ప్రభువలన ప్రేమింపబడిన సహోదరులారా, **ఆత్మ** మిమ్మును పరిశుద్ధ పరచుటవలనను, మీరు సత్యమును నమ్ముటవలనను, రక్షణపొందుటకు దేవుడు ఆదినుండి మిమ్మును ఏర్పరచుకొనెను (2 థెస్స. 2:13).

> … తండ్రియైన దేవుని భవిష్యద్ జ్ఞానమునుబట్టి, **ఆత్మ**వలన పరిశుద్ధత పొందినవారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచ బడినవారికి … (1 పేతురు 1:2).

సత్యవాక్యాన్ని ఆయన మనకు యిచ్చుటద్వారా పరిశుద్ధపరచబడు దీవెన వస్తుంది. మనలను పరిశుద్ధపరచుటకును అని కూడ చెప్పబడింది (యోహాను 17:17), దేవుని ప్రత్యేకమైన పనికొరకు మనలను ప్రత్యేకించుకొనుటకు.[3]

క్రైస్తవులుగా మనము పాప సంబంధమైన లోకపు గమ్యాలకు అర్పించుకొనకూడదు, కాని క్రీస్తుయొక్క రూపులోనికి (2 కొరింథీ. 3:17, 18) మనము రూపాంతరము (పొందుతూ ఉండాలి) పొందవలసిన వారమైయున్నాం (రోమా 12:1, 2). ఈ

పరిశుద్ధతను పెంపొందించు కొనుట (2 కొరింథీ. 7:1) మన బాధ్యతయై ఉంటుంది. బయలుపరచబడిన ఆత్మయొక్క వాక్యముచేత నడిపింపబడుతూ, మనచుట్టునున్న దుష్టలోకమునుండి ప్రత్యేకించబడినవారమైయుంటాం, ఎందుకంటె మనము ఆత్మ ఫలములను పెంపొందించుకున్నవారమై ఉంటాం.

పాత్రలను ఆరబెట్టడానికి, నేలను తుడవడానికి, కిటికీలను శుద్ధిచేయడానికి ఒక గుడ్డను ఉపయోగించుకొనవచ్చు. అయినా, ఒక దేశపు జెండాను ఆ బట్టపై ముద్రింపబడి ఉన్నట్టయితే, ఆలాటి మురికి పనులకు ఆ బట్టను ఉపయోగించరు. ఆ దేశానికే ప్రాతి నిధ్యమిచ్చే ఉన్నతమైన స్థితికి అది సమర్పించబడింది. తక్కిన బట్టలలోనుండి జెండాగుడ్డ ఎలా ప్రత్యేకపరచబడిందో, ఆలాగే తక్కిన జనులలోనుండి క్రైస్తవులు వేరుచేయబడినవారై యున్నారు. వారు పరిశుద్ధపరచబడుతున్నారు, లేక ఆత్మయొక్క పనిద్వారా దేవుని ఉన్నతమైన ఉద్దేశాలను నెరవేర్చవలసినవారై యున్నారు. లోకసంబంధమైన కార్యాలకు మనలను మనం ఎన్నటికిని ఉపయోగించుకొనకూడదు. ఆత్మ నియమించిన కొల పరిమాణాల ప్రకారం క్రీస్తును సేవించడానికి మనలను మనమే సమర్పించుకోవాలి.

## ముగింపు

క్రైస్తవుల జీవితాలలో పరిశుద్ధాత్మ బహు ప్రాముఖ్యమైన పాత్రను నిర్వహిస్తాడు. ఆత్మద్వారా మనము ప్రత్యక్షత, దిక్సూచి, బలము, యింకా యితర అనేకమైన ఉపకారాలను పొందుతాం. తాను మనకు అప్పగించిన సత్యాలను వెంబడించినప్పుడు, ఆత్మ తన పని ద్వారా మన జీవితాలను ఆశీర్వదిస్తాడు. క్రీస్తునందు నూతన జీవితపు ఆరంభము, దాని కొనసాగించునట్లు ఆత్మ జరిగించిన ప్రతిదానికి మనము ఆయనకు రుణపడియున్నాము. తండ్రితోను, కుమారునితోను, పరిశుద్ధాత్మతోను మనం పరలోకమందు జీవించడం అనేది చాలవరకు పరిశుద్ధాత్మపై ఆధారపడియుంటుంది.

---

సూచనలు

[1]Barklay M. Newman and Eugene A. Nida, *A Translator's Handbook on Paul's Letter to the Romans* (London: United Bible Society, 1973), 164. [2]Everett F. Harrison, "Romans," *The Expositor's Bible Commentary,* vol. 10, *Romans-Galatians,* gen. ed. Frank E. Gaebelein (Grand Rapids, Mich.: Zondervan, 1976), 96. [3]*Hagiazo* అనే మాటలోనుండి "పరిశుద్ధపరచబడిన" (క్రియా రూపం విశేషణము *hagios* అంటే, "పరిశుద్ధుడు" లేక "పరిశుద్ధమైన" అనేవి ఉంటాయి "నామవాచక రూపం" *hagiasmos,* "పరిశుద్ధపరచబడుట") అంటే "ప్రత్యేకపరచుట," లేదా "ప్రత్యేకమైన" పనికొరకు సమర్పించు అని అర్థం